తెలుగు కళా సమితి (న్యూజెర్సీ) చిన్న కథల పోటీలో రు. 200 గెలుపొందిన రచన

# ఎవడు చూడొచ్చాడు!!!

—బులుసు వెంకటేశ్వర్లు

'సౌందర్య ట్రాన్స్‌పోర్ట్స్'లో నేను క్లర్కుగా పన్జేస్తున్నాను! మా సంస్థ దేశంలో మంచి పేరున్న ట్రాన్స్‌పోర్టింగ్ ఏజన్సీల్లో ఒకటి! ఇంచుమించు ప్రతి టౌన్లోనూ దీనికి బ్రాంచీలున్నాయ్!!

ఎప్పుడో పదిహేనేళ్ళ క్రితం ఈ కంపెనీలో ప్రవేశించాను. ప్రైవేట్ కంపెనీ అన్న పేరేకానీ - జీత భత్యాలూ మిగిలిన సదుపాయాలూ మాకు అన్నీ బాగానే అందుతాయ్

మా సంస్థ హెడ్డాఫీస్ హైద్రాబాద్‌లో వుంది! ఎన్నడూ నేను హెడ్డాఫీసుకి వెళ్ళలేదు! ఆ అవసరం కూడా రాలేదు!!

మా అన్నయ్య ఈ మధ్యన హైద్రాబాద్‌లో ఇల్లు కట్టాడు! గృహ ప్రవేశానికి వెళ్ళడానికి నాకు లీవ్ దొరకలేదు అప్పట్లో

నన్ను హైద్రాబాద్ రమ్మని అన్నయ్య పదే పదే ఉత్తరాలు వ్రాస్తున్నాడు! సరే బయల్దేరాను.

అన్నయ్య ఇల్లు బాగా కట్టాడు. సుమారు లక్షా యాభై వేలదాకా ఖర్చు అయిందట

"రాకరాక హైద్రాబాద్ వచ్చావ్! అన్నీ చూపిస్తాను! రా!" అంటూ రోజొకచోటుకి తీసుకు వెళ్తున్నాడు నన్ను మా అన్నయ్య. జూ... మ్యూజియం... చార్‌మినార్...గోల్కొండ... టాంక్ బండ్ విగ్రహాలు ... ఇలా... వారం రోజులు సరదాగా గడిచిపోయేయ్!

అన్నయ్య, ఒదినా... పిల్లలూ... ఇంకా వుండమని బలవంతం పెడుతున్నా ... లీవ్ అయిపోవచ్చిందని చెప్పి... మర్నాడే ఇంటికి బయల్దేరాలని నిశ్చయించుకున్నాను.

హైద్రాబాద్‌లో శ్రీమతికి రెండు చీరలు కొన్నాను! పిల్లలకి రెడీమేడ్ బట్టలు తీసుకున్నాను!

సూట్‌కేస్ సర్దుకొంటుంటే ఆ కవరు కింద బడింది!! కవర్ని చేత్తో పట్టుకుని సాలోచనగా వుండి పోయాను

ఆఫీస్‌లో ... ఆనాడు... జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది

"బాబూ! హైదరాబాద్ ఎల్తున్నారంట??" అన్నాడు సింహాచలం! సింహాచలం మా ఆఫీస్‌లో అటెండర్ చాలా సంవత్సరాలుగా మా బ్రాంచీలో పన్జేస్తున్నాడు

ఆఫీసులో అందరికీ తల్లో నాలుకలా వుంటాడు!

"అవును! ఏం??" అడిగాను నేను!

"ఏం లేదు బాబూ! రెండు నెలల్లో నేను రిటైరై పోతున్నాను! నా ఉద్యోగం మా కుర్రాడికి ఇప్పించమని హెడ్డాఫీసుకి కాయితం ఎట్టుకుని ఏడాదైపోయింది! అక్కణ్ణించి 'ఊ' లేదు! 'ఆ' లేదు తమరోసారి ఆఫీసుకెళ్ళి ఆ యవహారం సూడండి బాబూ మీ పేరు సెప్పుకుని పట్టెడు మెతుకులు తింటాం!" ప్రాధేయపడుతున్నట్లు అన్నాడు సింహాచలం

సింహాచలం దృష్టిలో నేను ఉద్యోగానికి సిఫార్సు చేసేటంతటి గొప్పవాణ్ణన్నమాట!! నాకు కించిత్ గర్వం కలిగింది!!

కాలు మీద కాలు వేసుకుని - నిలాసంగా సిగరెట్ ఊదుతూ చిన్న సైజ్ ఉపన్యాసం అందుకున్నాను!

"సింహాచలం! రోజులు మారిపోయేయోయ్!! ఇది వరకైతే ఎందరికో ఎన్నో పన్లు చేయించాను ఇప్పుడో హెడ్డాఫీసులో అన్నింటికీ డబ్బు... డబ్బు... రూపాయ్ ఖర్చు పెట్టందే అసలు అక్కడ గేటు ముందు కూడా నించోలేం తెలుసా??..."

సింహాచలం బుద్ధిగా వింటున్నాడు నా మాటల్ని!

"సరే! ప్రయత్నం చేస్తాలే నువ్వు మళ్ళీ ఓ కాగితం మీద దరఖాస్తు రాసి ఇవ్వు!" అన్నాను చివరిగా!

సాయంత్రం.

దరఖాస్తు రాయించి పట్టుకొచ్చాడు సింహాచలం! ఆ కవర్ నాచేతికిచ్చి, అయిదు వందల రూపాయిలు నా ముందు పెట్టాడు!

"బాబూ! ఈ సొమ్ము కరుసు పెట్టండి సాలకపోతే మరో వందో, రెండొందలో కరుసు పెట్టండి!! తమలాంటి సదువుకున్న బాబులే... ఏపనైనా సేయించగల్రు మాకేటి తెల్సు బాబూ తూర్పు పడమరా తెలీనోళ్ళం "

నేను ఆ నోట్ల కేసి చూస్తున్నాను!!

మనసులో చిన్న సంఘర్షణ!! తీసుకోనా? వద్దా?

సింహాచలాన్ని మోసం చేయడం తప్పు కాదూ?

డబ్బు మాత్రం చాలా అవసరమే!!

అన్నయ్య, ఒదినలకీ కొత్త బట్టలు పట్టుకెళ్ళాలి!! ప్రయాణం ఖర్చులు!! ఇంకా హైదరాబాద్ నుండి వచ్చేటప్పుడు తేవల్సిన వస్తువులు శ్రీమతి కాయితంపై రాసి అట్టే పెట్టింది డబ్బు మాత్రం చాలా అవసరం

అవసరమే గెల్చింది!

డబ్బుతీసి జేబులో వుంచుకున్నాను!! హైదరాబాద్ నుండి వచ్చేక పని అవలేదంటూ డబ్బు సింహాచలానికి ఇచ్చెయ్యొచ్చు అంతే!.

సింహాచలం దండాలు పెడుతూ ఇంటికెళ్ళిపోయాడు!!

హైద్రాబాద్ వెళ్ళేక మళ్ళీ ఈ కవరు చూసింది - ఈ క్షణంలోనే

సింహాచలం ఇచ్చిన డబ్బుతో శ్రీమతికి రెండు చీరలు తీసుకున్నాను!! ఆ కవర్ని మళ్ళీ పెట్టె అడుగున పడేసాను!.

మర్నాడు తిరుగు ప్రయాణం!


ఆఫీస్‌లో జాయిన్ అయి ... నా సీట్లో కూర్చున్నాను!

సింహాచలం నాకేసి వస్తున్నాడు!

'ఏదికేదో చెప్పాలి!! తప్పదు! అవసర్మంగా అబద్ధం ఆడొచ్చునన్నారు పెద్దలు..." అనుకున్నాను "ఆ!! ఎవడు చూడొచ్చాడు??"

"దండాలు బాబూ! ఎప్పుడొచ్చేరు?"

"ఆ ఆ! రావోయ్! నిన్న వచ్చాను నీ పని మీద హెడ్డాఫీస్‌కి వరసగా నాల్రోజులు తిరగడం అయిపోయిందోయ్!








చాలా హై లెవల్లో ప్రయత్నం చెయ్యవలసి వచ్చింది! ... విషయం ఏమిటంటే - అక్కడ మనవాడొకడు వుండడం వల్ల పని అయింది. కానీ ... లేపోతే ... అసాధ్యం! ఆ 'దక్షిణ' ఏదో వాడిచేతి లోనే పడేసాను! చాలదని గొణిగాడనుకో- ఏదో నా మొహం చూసి ఊరుకు న్నాడు! త్వరలో ఆర్డర్స్ వచ్చేస్తాయ్!! ఆ ఏదీ. ఓ గ్లాస్ మంచినీళ్ళు అందుకో-"

సింహాచలం మంచినీళ్ళు పట్టుకొచ్చి చేతికందించాడు! తాపీగా జేబులోంచి ఓ కవరు తీసి నా కందించాడు. ఇదేదో హెడ్డాఫీసు నుంచి వచ్చింది బాబూ! చూడండి!" అంటూ

కవరు తెరిచి చదివాను హెడ్డాఫీసు నుంచి ... జి.ఎమ్. సంతకంతో లెటరు

"మీ విన్నపాన్ని పరిశీలించడం జరిగిం దనీ ... మీ కుమారుణ్ణి అదే బ్రాంచిలో అటెండరుగా నియమించడానికి సంస్థ సమ్మతించిందనీ ... మరో ఆర్డరు కాపీ ఆఫీసుకు పంపబడుతుందనీ..."

కవరుపైన స్టాంపు చూసాను పది హేడో తేదీన హైదరాబాద్‌లో పోస్టు చేయబడింది. అంటే నేను ఇక్కడ బయల్దేరిన రోజే సింహాచలానికి ఆర్డర్ అందింది

మూటిగా సింహాచలం మొహంలోకి చూస్తేక తలొంచుకున్నాను.

ఉన్న పాటున అక్కణ్ణించి - అదృశ్యమై పోయే శక్తి ఏదన్నా వుంటే బాగుం డునన్పించింది ఆ క్షణంలో నాకు.

మధ్యాహ్నం ప్రక్క గదిలో నుండి సింహాచలం మాటలు సన్నగా వినబడుతు న్నాయ్!

"నేను మామూలు మనిషినే బాబూ బతుకులో నేను కూడా అప్పుడూ అప్పుడూ మోసపోతూనే వున్నాను! కానీ బాబూ... తనరు కోప గించుకోకండి - ఇలా అన్నానని నన్ను మోసగించినోళ్ళు అందరూ సదూకు న్నోళ్లే! అదే చిత్రం ..."

రాత్రి - అయిదు వందల రూపా యలూ జేబులో పెట్టుకుని సింహాచలం ఇంటికి బయల్దేరాను.

సింహాచలం నన్ను క్షమిస్తాడు నాకా ధైర్యం వుంది

◆